క్లుప్తంగా

ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ

పరిశీలించిన కలెక్టర్ బాలాజీ



మచిలీపట్నంటౌన్: కృష్ణా– గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు స్థానిక నోబుల్ కళాశాల ఆవరణలో పోలింగ్ సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. గురువారం పోలింగ్ విధులు నిర్వహించడానికి కేటాయించిన సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ చేశామని పేర్కొన్నారు. మచిలీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో 23,555 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ్ ఉదయం ఎనిమిది గంటల నుంచి నాలుగు గంటల వరకు నిర్వహిస్తామన్నారు. డివిజన్ పరిధిలోని మండలాలను ఐదు సెక్టార్లుగా విభజించి 29 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా ఎన్నికల సామగ్రి పంపిణీకి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లో నాలుగు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సామగ్రిని పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఎన్నికల సిబ్బంది సామగ్రితో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో వెళ్లే విధంగా చేసిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఆర్ఓ కే చంద్రశేఖరరావు ఉన్నారు.

సామాజిక సేవ అవసరం

మోపిదేవి: విద్యార్థులు విద్యతో పాటు ఆధ్యాత్మిక, సామాజిక సేవ అవవర్చుకోవాలని అవనిగడ్డ డీగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ ఉమారాణి అన్నారు. మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని బుధవారం దర్శించుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పెదకళ్లేపల్లి శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి ఆలయానికి విచ్చేసే భక్తులకు కళాశాల విద్యార్థులు సేవలు అందించినట్లు తెలిపారు. యూత్ రెడ్ క్రాస్ కళాశాల విభాగాధిపతి డాక్టర్ ఏ వీర కుమారి, ఎన్ఎస్ఎస్‌యూనిట్ – 2 అధిపతి డాక్టర్ వైఎస్ సీహెచ్ రవిబాబును ప్రిన్సిపాల్ అభినందించారు.

బాలికలకు ఉన్నత విద్య తప్పనిసరి

పెడన: బాలికలకు ఉన్నత విద్య తప్పనిసరని సమగ్ర శిక్ష ఉర్దూ పెదగోగి రాష్ట్ర అసిస్టెంట్, మైనారిటీ వింగ్ సభ్యులు అబ్దుల్ గని అన్నారు. స్థానిక 15వ వార్డులోని మర్కజ్ దారుల్‌బిర్ హైస్కూల్ 24వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అబ్దుల్‌గని మాట్లాడుతూ మైనారిటీ బాలికలకు చక్కగా చదువుకుంటే భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేశారు. పెడనలో గత 24 సంవత్సరాలుగా బాలికల విద్య, ఉపాధి కోసం మర్కజ్ దారుల్‌బిర్ జనరల్ సెక్రటరీ డాక్టర్ సయీద్ అహ్మద్ ఒమరి మదని సొంత స్థలాన్ని, ధనాన్ని వితరణగా ఇచ్చారని, పేద, అనాథ బాలికలకు ఉచిత విద్యను అందిస్తూ వారికి బాసటగా నిలిచారని కొనియాడారు. విద్యార్థినులు తెలుగు, ఉర్దూ, అరబిక్ భాషల్లో ప్రసంగాలు చేయడంతో పాటు విద్య ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రదర్శనలు చేశారు. విద్యార్థినులకు ప్రశంసా పత్రాలను అందించారు. రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ ఖాదర్ భాషా, బెల్ విశ్రాంత ఉద్యోగి అబ్దుల్ లతీఫ్, ట్రస్టు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

96 మద్యం సీసాలు స్వాధీనం

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో బెల్టుషాపులు నిర్వహిస్తున్న ఇరువురిని మచిలీపట్నం ఎక్సైజ్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వారిపై కేసులునమోదు చేసి అరెస్ట్ చేశారు. ముస్తాఖాన్ పేటకు చెందిన కాసుల పద్మ అక్రమంగా మద్యం సీసాలను విక్రయిస్తోంది. ఎక్సైజ్ పోలీసులుదాడి చేసి 43 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నారు. బందరు మండలం చిన్నాపురం గ్రామానికి చెందిన బొమ్మిడి శ్రీనివాసరావు బెల్టుషాపు నిర్వహిస్తుండగా దాడి చేసి అతన్ని పట్టుకుని 53 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై ఎక్సైజ్ చట్టం కింద కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం శ్రీమాతా గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు మహేశ్వరపు శ్రీనివాస్ గాంధీ, అర్చకుడు చుండూరు నాగభాస్కరాచారి ఆధ్వర్యంలో కల్యాణం కమనీయంగా సాగింది. భవిరి శంకరనాథ్– మల్లేశ్వరి, రవి– సుభాషిణి, సోమనాథ్– దుర్గాలక్ష్మి, మార్కొండ శరశ్చంద్ర– శ్రీచందన, దాకోజు సతీష్– నమ్రతాసిరి పీటలపై కూర్చున్నారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం తదుపరి లింగోద్భవ వేళలో రుద్రాభిషేకం నిర్వహించారు. శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాద వితరణ చేశారు. అలయ కమిటీ

హర హర మహాదేవ..!

- శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- వైభవోపేతంగా మహాశివరాత్రి ఉత్సవాలు



పెదకళ్లేపల్లిలో ఉత్తరవాహినిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో మహాశివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లో వేకువజామునే భక్తిభావం కనిపించింది. సమీప శైవక్షేత్రాలకు భక్తులు తరలివెళ్లారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

శివనామస్మరణతో మార్మోగిన పెదకళ్లేపల్లి..

దక్షిణకాశీ పెదకళ్లేపల్లి శివనామ స్మరణతో మార్మోగింది. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 80 వేల మందికి పైగా భక్తులు శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శంకరమంచి భాస్కర విజయకుమార్, బుద్దు నాగవరప్రసాద్ బుధవారం తెల్లవారు జామున 2 గంటలకు శ్రీ స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు శ్రీఅమ్మవార్లకు సహస్ర నామార్చనలు నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి భక్తులకు శ్రీస్వామివారు, అమ్మవార్ల దర్శనం కల్పించారు. ఆలయం వెలుపల ప్రధాన రహదారి భక్తజనంతో రద్దీ ఏర్పడింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ ఆధ్వర్యంలో చల్లపల్లి సీఐ ఈశ్వరావు పోలీసు బందోబస్తు నిర్వహించారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలో శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి ఆలయ ప్రాగణంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన రాతి ప్రమిదలో జగజ్యోతిని ఆలయ అనువంశిక ధర్మకర్త యార్లగడ్డ శివరామప్రసాద్ వెలిగించారు.

యార్లగడ్డ(చల్లపల్లి): యార్లగడ్డలోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీనాగమల్లి కోటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. బుధవారం తెల్లవారు జామున యార్లగడ్డ హనుమంతరావు, ధనకోటేశ్వరీ దంపతులచే అఖండ దీపారధనతో కార్యక్రమాలను ప్రారంభించారు.అభిషేకాల అనంతరం స్వామివారి దర్శనాలు ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు వండి స్వామివారికి నివేదించారు. పుట్టలో పాలుపోసి మొక్కుబడులు తీర్చుకున్నారు. రైతులు తమ పశువులను, గొర్రెలు, మేకలను తోలుకు వచ్చి స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఎద్దుల బండ్లపై ఆలయనాకి రావటం పల్లె వాతావరణానికి అద్దం పట్టింది. హెడ్ కానిస్టేబుల్ పాండురంగారావు నేతృత్వంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.

కోడూరు: శివరాత్రి సందర్భంగా పితృదేవతలను స్మరిస్తూ కుటుంబీకులు కృష్ణాతీరంలో పిండప్రదానాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. మండలంలోని ఉల్లిపాలెం పుష్కరఘాట్ వద్ద పిండప్రదానాలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, సుదూర ప్రాంతాలవారు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నది ఒడ్డునే పురోహితులు పితృదేవతుల పేరు మీద కర్మలు జరిపారు. అనంతరం బ్రహ్మణులకు పాత్తర్లు సమర్పించి, పిండప్రదానం చేశారు. వీటిని నదిలో కలిపి తమ పూర్వికులను స్మరించుకున్నారు. ముందుగా నదిలో స్నానాలు చేసేందుకు భక్తులు పెద్దసంఖ్యతో తరలిరాగా, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కోడూరు: శైవక్షేత్రాలు భక్తజనంతో పోటెత్తాయి. బుధవారం ఉదయం నుంచే స్వామివార్ల దర్శనం కోసం భక్తులు ఆలయాల వద్ద క్యూకట్టారు. లింగారెడ్డిపాలెంలోని శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామివారి మూలమూర్తికి అర్చకులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. నాగాభరణాన్ని అలంకరించారు. వేణుగోపాలపురంలోని అంబికా సమేత అమరలింగేశ్వర స్వామివారి ఆలయంలో ఉన్న 108 శివలింగాలకు మహిళలు విశేష పూజలు చేశారు. హంసలదీవి, విశ్వనాథపల్లిలోని కాశీవిశ్వేశ్వరస్వామి, మాచవరంలోని రామలింగేశ్వర స్వామి, సాలెంపాలెంలోని అగస్తేశ్వరస్వామి, పిట్టల్లంకలోని బాలనాగేశ్వరస్వామివారి ఆలయాల్లో శివరాత్రి పూజలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ కమిటీల నిర్వాహకులు, గ్రామప్రముఖులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాగాయలంక: శివాలయాల్లో మహా శివరాత్రి ఉత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్వితా శ్రీనగరేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో అలయ ప్రధానార్చకులు కొల్లిపర సుబ్బారావు నేతృత్వంలో విశేషపూజలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 400 మంది భక్తులకు అన్నసంతర్పణ జరి పారు. కృష్ణాతీరంలోని శ్రీరామ పాద క్షేత్రం ఘాట్‌లోని శ్రీరామలింగేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు రామలింగేశ్వరుని స్వీయ అభిషేకాలు చేశారు. టి.కొత్తపాలెంలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, గణపేశ్వరంలోని గణపేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివార్లకు విశేష అభిషేకాలు జరిగాయి.

నాగాయలంక: మండలంలో శ్రీగంగా పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం భక్తజనం పోటెత్తారు. దేవదాయశాఖ ఈఓ సుధాకర్ నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకుడు కొల్లిపర తిరుమల సాయిభార్గవ్ ఆధ్వర్యంలో స్వామివారికి ఉభయదాతలచే అభిషేకాలు జరిగాయి. ఆలయ ధర్మకర్తల వంశీకులు భోగాది వెంకట సాంబశివరావు మనుమడు మండలి వెంకట్రామ్– సాయిసుప్రియ దంపతులు హోమంలో పీటలపై కూర్చున్నారు. భావదేవరపల్లి సర్పంచి మండలి ఉదయభాస్కర్ తదితర పలువురు సంగమేశ్వరుని దర్శించుకుని పూజలు జరిపారు. భక్తులకు అన్నసంతర్పణ జరిగింది.

నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీరామ పాద క్షేత్రం ఘాట్ వద్ద బుధవారం ప్రజలు తమ పితృదేవతలకు, పెద్దలకు పిండప్రదానం చేశారు. 2 వేల మందికి పైగా పిండప్రదాన క్రతువుల్లో పాల్గొనగా 50 మందికి పైగా పురోహితులు పూజలు జరిపారు. హైదరాబాద్‌లో స్థిరపడిన గ్రామస్తుడు కంఠంనేని ప్రేమ్‌చంద్ సౌజన్యంతో పిండ ప్రదాన పూజలకు వచ్చిన 800 మందికి ఉప్మా, మజ్జిగ పంపిణీ చేశారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, క్షేత్రపాలకుడు తలశిల రఘుశేఖర్, గడ్డిపాటి ప్రసాద్ సేవలందించారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవల శిబిరం నిర్వహించారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని నాగులేరు కాలువ గట్టు, శైవ క్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. భక్తులు తెల్లవారు జామునుంచే నాగులేరు కాలువకు చేరుకుని పుణ్య స్నానాలు ఆచరించారు. కాలువ గట్టుపై పితృదేవతలకు పిండప్రదానాలు చేశారు. ముత్తైదువలు వాయినాలు సమర్పించారు. నగరంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలోని 35 అడుగుల మహాశివుని విగ్రహం వద్ద మహామంగళ హారతులు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నాగులేరు కాలువ కట్టపై ఉన్న రసలింగేశ్వరస్వామి ఆలయం, గొడుగుపేట, గాంధీ బొమ్మ, బచ్చుపేట, శివగంగ, జోడుగుళ్లలోని శివాలయాలు, ఖొజ్జిల్లిపేట, చింతగుంటపాలెంలలోని శ్రీ నాగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. నాగులేరు కాలువలో ఏడు ఘాట్లలో స్నానాలు ఆచరించిన అనంతరం పితృదేవతలకు పిండప్రదాన కార్యక్రమాలు చేశారు. జంగం దేవరలు శంఖారావం చేశారు. రసలింగేశ్వర స్వామి ఆలయానికి, నాగేశ్వరస్వామి ఆలయం, ఆంజనేయస్వామి స్వామివార్లను దర్శించుకున్నారు. యాచకులకు భక్తులు బియ్యం, నగదును ఇచ్చారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, పులిహోర, పెరుగన్నం, మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లు, శీతలపానీయాలు పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కమిషనర్ బాపిరాజు పర్యవేక్షించారు.

బంటుమిల్లి: స్థానిక శ్రీ గంగా, పార్వతి సమేత చంద్రమౌళీశ్వరస్వామి, పెదతుమ్మిడి శ్రీ పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి, ఆముదాలపల్లి శ్రీ గంగా, పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి, కంచడం శ్రీ కాత్యాయిని సమేత కనకలింగేశ్వరస్వామి, ములపర్రు గ్రామంలోని శ్రీ పార్వతి సమేత నాగేశ్వర స్వామి ఆలయాల్లో ఉదయం భక్తుల సందడి నెలకొంది. ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం కుటుంబ పెద్దలను స్మరించుకుంటూ పూజారులకు, పురోహితులకు స్వయంపాకాలు, నూతన వస్త్రాలు సమర్పించి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అర్తమూరు గ్రామంలోని శ్రీ గంగ, పార్వతి సమేత రామేశ్వరస్వామి ఆలయంలో పండితులు అయిలూరి జైకిషోర్ శిష్య బృందం వేద మంత్రాలతో స్వామివారికి షట్కాల (6 సమయాల్లో) ఉదయం నుంచి రాత్రి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకాలను కమిటి సభ్యులు, పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఘంటసాల: స్థానిక అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహిళా అర్చకులు ఘంటసాల విజయలక్ష్మి, ఘంటసాల మాధవీలతల ఆధ్వర్యంలో బుధవారం అభిషేకాలు నిర్వహించారు. భక్తులు విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో పూజాధి నిర్వహించారు. స్వామి వార్లకు బిందెతీర్థం, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. మండలంలోని శ్రీకాకుళంలోని శ్రీఏకరాత్రి మల్లిఖార్జునస్వామి వారి దేవాలయం, శ్రీకాకుళేశ్వర స్వామి దేవస్థానం, శ్రీజలధీశ్వర స్వామి వార్ల దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాకుళం కృష్ణానదిలో భక్తులు పెద్ద ఎత్తున పుణ్యస్నానాలు ఆచరించి పిండ ప్రదానాలు చేశారు. రాత్రి జగజ్యోతిని వెలిగించారు.

కృత్తివెన్ను: దుర్గాపార్వతీసమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఎన్నికల కోడ్ నేపద్యంలో ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. బందరు మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ ఆధ్వర్యంలో బాడిగ శేషగిరిరావు రామాయమ్మ చారిటబుల్ ట్రస్టుపేరుతో, మరికొందరు దాతలు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. సంప్రదాయ భజనలు, కోలాటాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. టీటీడీ కల్యాణ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం జరిగింది.

నడకుదురు(చల్లపల్లి): నడకుదురులోని శ్రీబాలా త్రిపుర సుందరీ సహిత శ్రీపృధ్వీశ్వరస్వామి ఆలయంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కుటుంబ సమేతంగా పూజలు జరిపించారు. ఆలయ పర్యవేక్షకులు మండవ రవీంద్ర, ఆలయ అర్చకులు మామిళ్ళపల్లి పృధ్వీ కళ్యాణ్ చక్రవర్తి శర్మ, ఎం.శావరామకృష్ణ శర్మ, కంఠంరాజు చంద్రశేఖరరావు, ఎం.కోటేశ్వరరావు, ఎం.బాలసురేష్‌లు ఎమ్మెల్యేన సాదరంగా ఆహ్వానించారు. మండవ విశ్వేశ్వరరావు, మండల రాజగోపాల్, నాదేళ్ళ రమేష్, మల్లిపెద్ది త్రివిక్రమ్‌లు ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిక, ప్రసదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

గూడూరు: మండలంలో కంకటావలో ప్రసిద్ధి చెందిన అన్నపూర్ణసమేత శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. గూడూరులోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం, తరకటూరులోని చెన్నకేశవస్వామి ఆలయం, మల్లవోలులోని చెన్నమహేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి.

అవనిగడ్డ: ఎడ్లంకలో భక్తులు పెద్ద ఎత్తున బాలకోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. పశుపోషకులు తమ పశువులను ఆలయం చుట్టూ తిప్పి స్వామివారి అనుగ్రహం తీసుకున్నారు. ప్రభలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కృష్ణానదిలో పితృదేవతలకు పిండార్పణ చేశారు. యువత మజ్జిగ పంపిణీ చేయగా, ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ బక్తులకు పులిహోర ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ప్రపంచ ఆర్యవైశ్యసభ అవనిగడ్డ శాఖ ఆధ్వర్యంలో స్థానిక వంతెన సెంటర్ నుంచి శివాలయం వరకూ అభిషేక ద్రవ్యాలతో కూడిన బిందెలు, కావిళ్లలో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శివాలయంలో స్వామివారికి వాటిని సమర్పించి పూజలు చేశారు. సంఘం నేతలు విస్సంశెట్టి శ్రీనివాస్, కొల్లిపర రాధాకృష్ణ, దేసు శేషు, కోడూరు పవన్‌లు పర్యవేక్షించారు.



విశ్వనాథపల్లిలో ప్రత్యేక అలంకారంలో కాశీవిశ్వేశ్వరస్వామి



ఘంటసాల శ్రీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో..



అవనిగడ్డలో శివాలయం వద్ద అభిషేక ద్రవ్య బిందెలు

హర హర శంభోశంకర..!

పెడన: పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ ఆగస్తేశ్వర స్వామి వారి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన గర్భాలయ ద్వారానికి వెండి తాపడ ప్రారంభ మహోత్సవం సింగరాజు వంశీయులచే ప్రారంభోత్సవం నిర్వహించారు. బూసం అగస్తయ్య దంపతులు విరాళంతో అభివృద్ధి కమిటీ వారు తయారు చేయించిన స్వర్ణ నామాలను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చేతుల మీదుగా స్వామి వారికి సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గూడూరు అగస్థయ్య, అర్చకులు శివ ఆగస్తేస్వర స్వామికి అలంకరించగా బంగారు నామాలతో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. సింగరాజు వంశస్తులు వెండి తాపడం, శివాలయం అభివృద్ధి పనుల నిమిత్తం రూ.40 వేల చెక్కును ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ చేతుల మీదుగా అభివృద్ధి కమిటీకి అందజేశారు. బీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు దంపతులు, భళ్ల ప్రసాద్, కట్టా హేమ సుందర మూర్తి, చందన నారాయణరావు పాల్గొన్నారు. ఆగస్తేశ్వర శివాలయం, పాతపేట భజన గుడి వద్ద, మఠం వీధిలో పలు చోట్ల భక్తులు స్వామి వారి అన్నప్రసాదాలను స్వీకరించారు. కాపులవీధిలో వినాయకుని గుడి వద్ద నుంచి శ్రీఆగస్తేశ్వరస్వామి శివాలయం వరకు ప్రభల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాపులవీధి భక్త బృందం ఆధ్వర్యంలో తీన్‌మార్ మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. స్వామి వారిని దర్శించుకున్నారు.

కృష్ణా నదిలో పుణ్యస్నానాలు



పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీ పెదకళ్లేపల్లిలో ఉత్తరవాహిని గాప్రవహిస్తున్న కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము 3 గంటల నుంచే స్నానాలకు అనమతించడంతో సుమారు లక్ష మందికి పైగా పుణ్యస్నానాలు చేసి ఉంటారని అధికారులు తెలిపారు.కృష్ణానదిలో పిండాలు వదిలి స్నానాలు చేయగా, మహిళలు పూలు, పండ్లు, బియ్యం, ఆకుకూరలతో కూడిన చాటలను ముత్తైదువలకు అందించారు. జంగం దేవరలు శంకునాథం ఆలపించగా, గంగిరెద్దులను ఆడించి పెద్దలపేర్లు పలికించడం వంటివి నిర్వహించారు. ఆర్డీవో కె.స్వాతి పితృదేవతలను తలచుకుని జంగం దేవరలకు స్వయం పాకం అందించారు. జల్లు స్నానం చేశారు. ఇన్‌చార్జి ఆర్ఐ మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్వోలు వేణు, వెంకటేశ్వారావు, రమణ, అవనిగడ్డ సీఐ యువకుమార్ ఉన్నారు.



నడకుదురు ఆలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కుటుంబ సభ్యులు



నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్‌లో అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు



నాగులేరు కట్టపై పిండప్రదానాల కార్యక్రమం



పెదకళ్లేపల్లిలో జగజ్యోతి వెలిగిస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త శివరామప్రసాద్



యార్లగడ్డలో గొర్రెల ప్రదక్షిణ చేయిస్తున్న యజమానులు

దాతల ఔదార్యం.. భక్తులకు అన్నదానం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మహాశివరాత్రి సందర్భంగా పెదకళ్లేపల్లి శ్రీ దుర్గానాగేశ్వరస్వామివారి దర్శనార్థం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దాతలు తమ ఔదార్యం చాటుకున్నారు. బుధవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులకు పులిహోర, మజ్జిగ, మంచినీరు అందించడంతో పాటు పలువురు దాతల సహకారంతో అన్నదానాలు నిర్వహించారు. స్థానిక గొర్రెపాటి దుర్గానాగేశ్వరావు ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో 10 వేల మందికి పైగా భక్తులకు అన్నదానం చేశారు. స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో సుమారు 10 వేల మంది భక్తులకు అన్నదానం చేసినట్లు సొసైటీ అధ్యక్షురాలు గంధం పద్మజా నాయుడు తెలిపారు. పెదప్రోలు శ్రీ అద్దంకి నాంచారమ్మ తల్లి ఆలయ కమిటీ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరావు ఆధ్వర్యంలో పులిహోర, దద్దోజనం, రవ్వకేసర భక్తులకు అందించారు. వైఎస్సార్ అభిమాని సంగం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 1,200 మందికి అన్నదానం చేశారు. గరికిపాటి బుల్లి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. చల్లపల్లి జెడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరావు, యూత్ నాయకులు బడే గౌతం, బ్రహ్మరాజు పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు



మజ్జిగ పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

టీడీపీ నేతపై జనసేన జనవాణిలో ఫిర్యాదు

నాగాయలంక: టీడీపీ నేత రేషన్ బియ్యం అక్రమ కొనుగోలు, మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వైనంపై సోమవారం జనసేన జనవాణిలో ఫిర్యాదు చేసినట్టు పర్రచివర శివారు బిల్లీగ్రాహం నగర్‌కు చెందిన గుంటూరు సురేష్, చిక్కాల సురేష్ బాబు బుధవారం తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా విషయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సీరియస్‌గా ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలన్నప్పటికీ కూటమి నేతలు దందాలు చేస్తున్నారనిఫిర్యాదులోపేర్కొన్నామన్నారు. మండలంలో టీడీపీ అక్రమాలపైన, సహకరిస్తున్న అధికారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు వారు తెలిపారు.

లక్ష్యం, ఏకాగ్రత విజయానికి మెట్లు

బంటుమిల్లి: పరీక్షల్లో అత్యధికమార్కులు సాధించాలంటే సబ్జెక్టుపై ఏకాగ్రత, భివష్యత్తు కోసం లక్ష్యం రెండు నిచ్చెనలా దోహదపడతాయని డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆంజనేయులు అన్నారు. స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం జరిగింది. పాఠశాల డైరెక్టరు సాబూజాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంజనేయులు మాట్లాడారు. మచిలీపట్నం చైతన్య కాలేజీ ప్రిన్సిపాల్ హరీష్, మచిలీపట్నం సెయింట్ జాన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ జాన్, పెడన విశ్వభారతి ప్రిన్సిపాల్ గౌరిప్రసాదు, పాఠశాల హెచ్ఎం ఝాన్సీ సాబూ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను డైరెక్టరు సాబూజాన్ సత్కరించారు.

సీసీ కెమెరాలతో నిఘా

కోడూరు: కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ చాణిక్య తెలిపారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయం పక్కనే ఉన్న స్త్రీశక్తి భవనం, ఉర్దూ పాఠశాలల్లో రెండు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో వీటి వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ సిబ్బంది సైతం కేంద్రాలకు చేరుకున్నారు. ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్

పెడన: కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 27న జరగనున్న పోలింగ్‌కు సంబంధించి పెడన నియోజకవర్గంలో పట్టభద్రుల పోలింగ్‌లో ఓటు వేసేందుకు 4,471 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 2,761, మహిళలు 1,710 ఉన్నారు. ఈ ఓటర్లు ఓటు వేసేందుకు నియోజకవర్గంలోని పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు నాలుగు మండలాల్లో నాలుగు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఈ నాలుగు పోలింగ్ స్టేషన్లలో ఆరు బూత్‌లను ఏర్పాటు చేశారు. పెడన, బంటుమిల్లి మండలల్లో రెండు చొప్పున, కృత్తివెన్ను, గూడూరు మండలాల్లో ఒక్కో బూత్‌ను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ఉంటుందని స్పష్టం చేశారు.

బంటుమిల్లి సమస్యాత్మక కేంద్రంగా గుర్తింపు

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బంటుమిల్లి మండలంలోని పోలింగ్ స్టేషన్ సమస్యాత్మక కేంద్రంగా నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో అక్కడ బందోబస్తు మరింత పెంచినట్లు పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె నాగేంద్రప్రసాద్ తెలిపారు. మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందని పెడన ఎన్నికల అధికారి, తహసీల్దారు కె.అనిల్‌కుమార్ తెలిపారు.

కోడూరు: మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శ్రీనునాయక్ బుధవారం తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనం, ఉర్దూ పాఠశాలలో ఉన్న 195,196 పోలింగ్ బూత్‌లలో ఎన్నిక జరుగుతుందని చెప్పారు. మండలంలో 1,416 మంది గ్రాడ్యుయేట్లు ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు.



మోపిదేవిలో మెటీరియల్‌తో ఎన్నికల సిబ్బంది

మోపిదేవి: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ శ్రీవిద్య బుధవారం తెలిపారు. మండలంలో మోపిదేవి జెడ్పీపాఠశాల ఆవరణలో పోలింగ్ కేంద్రం 191లో 750 మంది, కేంద్రం 192లో 430 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. సెక్టార్ అధికారి పర్యవేక్షణలో మొత్తం 7 గురు సిబ్బంది పనిచేస్తారని తెలిపారు. ఓటరు స్లిప్‌తో పాటు తమ ఆధార్ లేదా ఏదైనా గుర్తింపుకార్డుతో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని వివరించారు.

చల్లపల్లి: చల్లపల్లి ఎస్ఆర్‌వైఎస్పీ కళాశాలలో గురువారం జరగనున్న పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల ఇన్‌చార్జి తహసీల్దార్ జి.శ్రీలత తెలిపారు. కళాశాలలోని గోల్డెన్ జూబ్లీ హాల్లో 189, 190 రెండు పోలింగ్ స్టేషన్లు సిద్ధం చేసినట్లు వివరించారు. మండలం మొత్తంలో 2,024 పట్టభద్రుల ఓటర్లు ఉండగా 189 పీఎస్‌లో 959 మంది, 190 పీఎస్‌లో 1,065 మంది ఓటర్లు ఓట్లు హక్కును వినియోగించుకోనున్నట్లు వివరించారు.